క్లుప్తంగా

నేటి నుంచి ప్రత్యేక తరగతులు

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు శనివారం నుంచి పెండ్లిమర్రి జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన వారు, ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

వేల్పుల చెరువుకు నీరు విడుదల

వేముల : వేల్పుల చెరువుకు నీటిని అధికారులు శుక్రవారం విడుదల చేశారని వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుకు నీరు ఎత్తిపోతల ద్వారా తరలించడానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషి చేసినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చెరువుకు చేరుతున్న నీటితో భూగర్భజలాలు పెరిగి వ్యవసాయ బోర్లలో సాగునీటికి కొరత ఉండదన్నారు. చెరువుకు పూర్తిస్థాయిలో నీరు నిండేవరకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఎంపీ ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ప్రారంభమైన మొలకల పౌర్ణమి

సింహాద్రిపురం : మండలంలో శుక్రవారం నుంచి మొలకల పౌర్ణమిని ప్రారంభించారు. శుక్రవారం నవ ధాన్యాలతో ఒక్కొక్క కుంపటిలో ఒక్కొక్క రకపు ధాన్యాలు వేసి పూజలు ప్రారంభించారు. ఈ పూజలు మొలకల పౌర్ణమిగా నిర్వహిస్తారు. ఈ ధాన్యాలలో బాగా మొలక వచ్చిన పంట ఈ ఏడాది బాగా పండుతుందని పూర్వీకుల నమ్మకం.

ఎస్‌పీఎఫ్ సిబ్బందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎస్‌పీఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.వి.రామిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టులో పనిచేస్తున్న ఎస్‌పీఎఫ్ అధికారులు, సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ రాజు, డాక్టర్ సుదీష్నలు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ హుస్సేనయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న కొందరి ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. గతంలో జగనన్న కాలనీలో సుమారు 64 ఇళ్ల నిర్మాణ పనులలో జరిగిన అవకతవకలపై హౌసింగ్ పీడీ విచారణ చేపట్టారు. తుది నివేదికలను పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ ఎస్‌ఈకి పంపించారు. ఆయన ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఏడుగురి సచివాయల ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

పులివెందుల టౌన్ : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిల సౌజన్యంతో మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద 4వ వార్డు కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్ ఏర్పాటు చేసిన దివంగత డాక్టర్ ఇసీ గంగిరెడ్డి మజ్జిగ చలివేంద్రం నిరంతరాయంగా కొనసాగుతోంది. శుక్రవారం ఈ మజ్జిగ పంపిణీ కేంద్రం వద్దకు ప్రయాణీకులు, పాదాచారులు, వచ్చి మజ్జిగను సేవిస్తున్నారు.

సీనియర్ రిపోర్టర్‌కు ఘన నివాళి



పూలంగళ్ల సర్కిల్ వద్ద రత్నమయ్యకు నివాళులర్పిస్తున్న మీడియా మిత్రులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని సీనియర్ పాత్రికేయుడు, సాయంకాలం రిపోర్టర్ రత్నం అకాల మరణంపట్ల పాత్రికేయులు శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ ప్రెస్‌క్లబ్ కార్యాలయం వద్ద నుంచి పూలంగళ్ల సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, మీడియా మిత్రులు పాల్గొన్నారు.

కల్యాణానికి అందరికీ ఆహ్వానం

లింగాల : లింగాలలో పునఃనిర్మించిన శ్రీకోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం మే 1, 2, 3వ తేదీలలో నిర్వహిస్తున్నామని.. అందరూ ఆహ్వానితులేనని గ్రామ ప్రజలు తెలిపారు. శుక్రవారం ఎగువ లింగాల, దిగువ లింగాల గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ సీతారాముల కళ్యాణానికి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

మండు వేసవిలో జలకళ

- రాయలాపురం బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాం వద్ద జల సవ్వడులు
- ఈత కొలనుగా యువత సద్వినియోగం
- వృథా నీటికి అడ్డుకట్ట పడిన వైనం





ఈతకు అనువుగా ఉన్న చెక్‌డ్యాం (ఇన్‌సెట్)
పులివెందులలోని నూతనంగా నిర్మించిన రాయలాపురం బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాం

పులివెందుల : మండు వేసవిలోనూ చెక్‌డ్యాంలో జలకళ సంతరించుకుంది. మూడేళ్లుగా వంక నుంచి వృథాగా నీరు ప్రవహిస్తుండేది. ప్రస్తుతం బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాం నిర్మాణంతో ఆ వృథా నీటికి అధికారులు అడ్డుకట్ట వేశారు. లేకపోతే ఈ ఏడాది కూడా వృథాగా నీరు వెళ్లిపోయేది. బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాంను యువత ఈత కొలనుగా ఉపయోగించుకుంటున్నారు. పులివెందులకు సమీపంలోని రాయలాపురం వంతెన వద్ద ఈ సుందరమైన జలకళ దృశ్యాలు చూడవచ్చు. రాయలాపురం వంతెన శిథిలావస్థకు చేరడం, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో కొత్త బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాం ఏర్పాటుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సూచనలతో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి కొత్తబ్రిడ్జి కమ్ చెక్‌డ్యాంను ఏర్పాటు చేయించారు. ఆ వంతెనను కూడా కేబుల్ బ్రిడ్జి మోడల్ తరహాలో నిర్మించడంతో పట్టణ వాసులకు కొత్త అనుభూతిని అందిస్తోంది. సాయంత్రం వేళ పట్టణ వాసులు రాయలాపురం బ్రిడ్జి కమ్ చెక్ డ్యాం వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. రోజు సాయంత్రం కాగానే వంతెన వద్ద వరుసగా కార్లు, బైకులు, ఆటోలు బారులు తీరి ప్రయాణీకులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తుండటం కనిపిస్తోంది. దీంతో రాయలాపురం వంతెనను ముద్దుగా సెల్ఫీ జోన్‌గా ప్రయాణీకులు పిలుచుకోవడం కొస మెరుపు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



దిగువపల్లెలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని దిగువపల్లె, మైసూరారెడ్డి కాలనీల్లో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హత వుండి ఏవైనా పథకాలు అందకున్నా, ఇతర సమస్యలు వున్నా తెలపండని పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మించాలని ప్రజలు కోరగా వాటిని మంజూరు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ హరి కేశవరెడ్డి, సర్పంచ్‌లు కుళాయప్ప, ఓబుల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దస్తగిరి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, శివశంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ రఘు, ఈఓ పీఆర్‌డీ ప్రసాద్, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఈలు ప్రతాప్‌రెడ్డి, పవన్, ముజీబ్, డానియల్ జోసెఫ్, ఏపీఎం శైలజ, రెవెన్యూ అధికారి స్వరూప్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డీ కొత్తపల్లెలో..

మండల పరిధిలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని డీ కొత్తపల్లె గ్రామంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రికి చెందిన ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ఫ్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు పాదరక్షలు పంపిణీ



కుష్టు వ్యాధిగ్రస్తులకు ఎంసీఆర్ పాదరక్షలు పంపిణీ చేస్తున్న డాక్టర్, తదితరులు

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యులు నవీన్, జీవన్‌కుమార్‌లు కుష్టు వ్యాధిగ్రస్తులకు ఎంసీఆర్ పాదరక్షలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కుష్టు వ్యాధిగ్రస్తులకు కాళ్లకు సరిపడ కొలతలు తీసుకుని పాదరక్షలు తయారు చేయించి వారికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. కుష్టు వ్యాధిపట్ల జాగ్రత్తలు, సూచనలు పాటించి వైద్యుల సలహాలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ సుబ్బారెడ్డి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

–ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ముద్దనూరు : వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముద్దనూరు మేజర్ పంచాయతీపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ముద్దనూరులోని కొత్తకొట్టాలవీధిలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడుతూ ముద్దనూరులో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తిచేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఇంద్రాణి, పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు సుమంత్, పార్టీ నాయకులు పుల్లయ్య, వరదారెడ్డి, గుర్రప్ప, నవజ్యోత్‌రెడ్డి, వీరాంజనేయరెడ్డి, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు చేపట్టండి

ఎర్రగుంట్ల : రానున్న వేసవిలో గ్రామాలలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం ఉప మండలాధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసపల్లి రోడ్డులోని ఈడ్గా వద్ద వంతెన కూలిపోయే దశలో ఉందన్నారు. ఈ వంతెనపై మూడు గ్రామాల వారు రాకపోకలు చేస్తుంటారు. వంతెనకు మరమ్మతులు చేపట్టాలని, అలాగే డ్రైనేజీ కూడా పొడగించాలన్నా రు. అనంతరం మండలస్థాయి అధికారులు వారి శాఖ అభివృద్ధి నివేదికలు తెలియజేశారు. సర్పంచ్‌లు వారి గ్రామాలలో నెలకొన్న సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, వివిధ శాఖాధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంపై డీఆర్‌ఎంకు వినతి

ఎర్రగుంట్ల : స్థానిక రైల్వేస్టేషన్ చుట్టూ ప్రహరీ నిర్మించడంవల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు వచ్చిన రైల్వే డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డిని ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి కలసి విన్నవించారు. దీనిపై డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వేస్టేషన్ సమీపంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్‌బీఐ, తపాల, వ్యవసాయ తదితర కార్యాలయాలు ఉన్నాయని వీటి కోసం ప్రజలు నిత్యం వెళుతుంటారని ఈ ప్రహరీ నిర్మాణంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన డీర్‌ఎంకు వినతిపత్రం రూపంలో విన్నంచామన్నారు. అలాగే ముద్దనూరు రైల్వేస్టేషన్‌లో ధర్మవరం, చెన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్లను స్టాపింగ్ చేయాలని ముద్దనూరు మాజీ ఎంపీపీ మునిరాజరెడ్డి ఎమ్మెల్యేతో కలసి వినతిపత్రాన్ని డీఆర్‌ఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్థన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం ఉండకూడదు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నీటి సరఫరా సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుత వేసవికాలంలో ఎక్కడే కానీ నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. సిబ్బంది ప్రజలతో మర్యాదగా మాట్లాడుతూ వారికి నీటి సరఫరా సమయం తెలుపుతూ ఉండాలన్నారు. ఒకవేళ ఎక్కడైనా నీటి సరఫరాకు అంతరాయం కలిగితే నీరు సరఫరా చేసేందుకు ట్యాంకర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అనంతరం అంబకపల్లె రోడ్డులోని దోబీఖానా ప్రాంతంలో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈ ఎక్నాత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని అన్ని సీడీపీఎస్ సెంటర్లలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల పోస్టులకు, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. వేముల మండలం నారేపల్లె అంగన్‌వాడీ టీచర్ ఓసీకి, పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రాజ్యలక్ష్మీ హాలు సమీపంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు ఓసీకి, తొండూరు మండలం యాదవ వారిపల్లెకు చెందిన అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఓసీకి, లింగాల అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఓసీకి కేటాయించడం జరిగిందన్నారు. ఆసక్తి గల వారు ఈ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు పులివెందుల ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

సీనియారిటీని బట్టి పదోన్నతి కల్పించాలి



ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కమలాపురం : ఐసీడీఎస్ శాఖలో ఏర్పడిన ఖాళీలను అర్హత కలిగిన సీనియారిటీ ఉన్న అభ్యర్థులతోనే భర్తీ చేయాలని, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారం పోస్టులు భర్తీ చేస్తే సహించేది లేదని ఏఐటీయూసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మాలేపాడు-1 అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్త ఇటీవల రిటైర్ అయ్యారని, ఆ స్థానంలో 8 ఏళ్ల సీనియారిటీ ఉన్న మేరి హెప్సిబాకు పదోన్నతి కల్పించకుండా కేవలం 8 నెలల క్రితం నియమింపబడిన హెల్పర్ పుష్ప చందనాకు ప్రమోషన్ కల్పించడంపై వారు శుక్రవారం ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అవినీతికి పాల్పడుతున్న ఐసీడీఎస్ అధికారుల పట్ల జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఖాళీలను భర్తీ చేయాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కమలాపురం ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంజుల, సీపీఎం మండల కార్యదర్శి నాగేశ్వరరావు ఇతర నాయకురాళ్లు పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల జాగ్రత్తగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాగలక్ష్మీరెడ్డి

కమలాపురం : వేసవి కాలం ముగిసే వరకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన టి.చదిపిరాళ్లలో పర్యటించి ప్రజలకు వడదెబ్బ, మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి మాట్లాడారు. మే నెల ముగిసే వరకు ఎండలు ఎక్కువగా ఉంటాయని, పనులకు వెళ్లే వారు తెల్లవారు జామునే వెళ్లి 11 గంటల కంతా ఇంటికి చేరుకోవాలన్నారు. సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగవద్దని, నీళ్ల అధికంగా తాగాలన్నారు. డెంగీ, మలేరియా జ్వరాలు రాకుండా రాత్రిళ్లు దోమతెరలు వాడాలన్నారు. దోమలు గుడ్లు పెట్టకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మంగమ్మ, ఆశా, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

వేంపల్లె : మండలంలోని వివిధ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీటీసీ రవి కుమార్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న కాలనీల్లో ఏర్పాటైన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు జూన్ నెలాఖరుకల్లా పూర్తి చేసే విధంగా వలంటీర్లు కృషి చేయాలన్నారు. అలాగే లబ్ధిదారులకు సిమెంటు, ఇసుక, స్టీల్, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి, మండల స్పెషలాఫీసర్ రవీంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, ఈఓ రవి కుమార్‌రెడ్డి, ఏపీఎం బాలస్వామి, ఏపీఓ చంద్రశేఖర్, ఎంపీటీసీలు చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం



స్వామి వారికి ప్రత్యేక ఫాతేహాలు చేస్తున్న పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రీ

జమ్మలమడుగు : హజరత్ సయ్యద్‌షా గూడుమస్తాన్ వలి దర్గా ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేలాది మంది భక్తులు స్వామి వారికి ప్రత్యేక చదివింపులు చేయించారు. ఢిల్లీకి చెందిన ఆలీమ్ ఆరీఫ్ సాబ్రి పార్టీ, చోటి షబ్నమ్ ఖవ్వాలి పోటీలు జరిగాయి. తెల్లవారు జామున ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆయన కుమారుడు సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ, జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్ పాషా ఖాద్రీలో గంధోత్సవాలను వేరువేరుగా నిర్వహించారు. డీఎస్పీ నాగరాజు, అర్బన్ సీఐ సదాశివయ్య, రూరల్ సీఐ కొండారెడ్డిల పర్యవేక్షణలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

గ్రామ సచివాలయాల్లోనే స్పందన కార్యక్రమం

సింహాద్రిపురం : మండలంలోని గ్రామ సచివాలయాల్లో సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమం నిర్వహించి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం సింహాద్రిపురలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని.. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. అలాగే గ్రామ సచివాలయ పరిధిలోని సమస్యల కోసం కడపకు వెళితే సంబంధిత గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యులవుతారన్నారు. ప్రజలు తెలిపే స్పందన సమస్యలను ప్రతి రోజు 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామ సచివాలయాల్లోని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

కూలర్ వితరణ



వికలాంగుల సేవా కేంద్రానికి ఎయిర్ కూలర్‌ను అందజేస్తున్న ఎంఈఓ వెంకట్రామిరెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని చిన్నముసల్‌రెడ్డిపల్లె గ్రామంలోని అనాథ వికలాంగుల సేవా కేంద్రానికి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వి.స్వరూపరాణి ఎంఈఓ వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఎయిర్ కూలర్‌ను అందజేశారు. కార్యక్రమంలో 17వ డివిజన్ వైఎస్ ఆర్‌సీపీ ఇన్‌చార్జ్ మట్లి శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు అందించాలని మంత్రికి వినతి

సింహాద్రిపురం : రైతులు వ్యవసాయం చేసేందుకు అనువుగా చిన్న ట్రాక్టర్లు, స్ప్రేయర్స్, గోరు, గుంటక, మడకలు, విత్తన గొర్రు తదితర పరికరాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి ఇప్పించాలని వ్యవసాయ శాఖమంత్రి కాకాని గోవర్దన్ రెడ్డిని వైఎస్సార్ ఉద్యాన యూనివర్శిటీ రాష్ట్ర బోర్డు మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, మండల రైతులు శుక్రవారం రైల్వేకోడూరులోని అనంతరాజు యూనివర్శిటీలో కలసి విన్నవించారు. అలాగే పులివెందుల ప్రాంతంలో సాగు చేసిన చీనీచెట్లు తెగుళ్లతో చనిపోతున్నాయని.. వాటి నివారణకు సబ్సిడీతో మందులను ఇప్పించాలని ఆయన కోరారు.

ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

తొండూరు : మండల పరిధిలోని సంతకొవ్వూరు గ్రామంలో శుక్రవారం పీహెచ్‌సీ డాక్టర్ ముంతాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవ ర్యాలీని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్ ప్రారంభించి మాట్లాడారు. ఈ ర్యాలీలో దోమ తెరలు వాడండి.. దోమ కాటునుంచి రక్షణ పొందండి, నీటి నిల్వలు-దోమలకు ఆవాసాలు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాయక్, పీహెచ్‌ఎస్ సుభద్రమ్మ, ఆరోగ్య విస్తరణాధికారులు సంపత్‌కుమార్, సుబ్రమణ్యం, సిబ్బంది హిమశిఖరాలరెడ్డి, పవన్, సీహెచ్‌ఓలు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ ఫలాలు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని రాజారెడ్డి కాలనీ, నగరిగుట్ట, క్రిష్టియన్‌లైన్ ప్రాంతాలలో శుక్రవారం జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్-జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె-2 పరిధి మల్లికార్జునపురం, ఎర్రబల్లె గ్రామాల్లో శుక్రవారం జేసీఎస్ కన్వనర్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ×మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని× నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు సి.ప్రతాప్‌రెడ్డి, సి.జగన్‌మోహన్‌రెడ్డి, డిష్ వెంకటరెడ్డి, రామ మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వేములలో..

వేముల : మండలంలోని పెద్దజూటూరు పంచాయతీ పరిధిలోని కుప్పగుట్టపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రామచంద్రారెడ్డి జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, నారాయణస్వామి, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పని చేయని ఆధార్ సెంటర్



కమలాపురం : ప్రస్తుత తరుణంలో ఏ ప్రభుత్వ పథకాలు పొందాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. ఆధార్ లేనిదే ఏ పని జరగదు. ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నారు. నెలలో కనీసం రెండు సార్లైనా తాత్కాలిక ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసి ఆధార్ సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాంటి కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని నాల్గవ సచివాలయంలో ఉన్న పర్మనెంట్ ఆధార్ సెంటర్ రెండు మాసాలుగా పని చేయడం లేదు. ఆధార్ సేవలు అందించే ల్యాప్‌టాప్ పని చేయకపోవడంతో సేవలు అందించలేక పోతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి రెండు సార్లు జీఎస్‌డబ్ల్యూఎస్‌కు ఫిర్యాదు చేశామని, అయినప్పటికి ఎలాంటి స్పందన లేదని సచివాలయ అడ్మిన్ శివానందరెడ్డి తెలిపారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

కమలాపురం : కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని చిలంకూరు మండలం మాలేపాడు-1 అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న హెల్పర్‌నే కార్యకర్తగా నియమించాలని సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సీడీపీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులు రెడ్డి, ఇతర నాయకురాళ్లు పాల్గొన్నారు.